## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ విదేశీ పర్యటన నిమిత్తం మరికొద్దిసేపటిలో జపాన్ కు బయలుదేరుతారు.

- పిఎం జన్ ధన్ యోజన భారతదేశాన్ని ఆర్థిక సాధికారత వైపు నడిపించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

- మహారాష్ట్రలోని ముంబైలో నిన్న రాత్రి నాలుగు అంతస్తుల భవనం కూలిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 17 కు చేరుకుంది.

- ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ విదేశీ పర్యటన నిమిత్తం మరికొద్దిసేపటిలో జపాన్ కు బయలుదేరుతారు. టోక్యోలో రేపటి నుండి రెండురోజుల పాటు జరగనున్న ఇండియా-జపాన్ 15వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి పాల్గొంటారు. ఇది జపాన్ లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎనిమిదవ పర్యటన కాగా.. జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో తొలి శిఖరాగ్ర సమావేశం. ఈ పర్యటన సందర్భంగా, ఇరు దేశాల ప్రధానులు భారత్, జపాన్ దేశాల మధ్య రక్షణ, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, ఆవిష్కరణలు వంటి పలు రంగాలపై చర్చించనున్నారని, అలాగే వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యంపై కూడా సమావేశం కానున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా ఉన్న స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని జపాన్ లోని భారత రాయబారి సిబి జార్జ్ ఆకాశవాణితో మాట్లాడుతూ..

(వాయిస్ బైట్...35 సెకన్లు)

జపాన్ పర్యటన అనంతరం ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 1 వరకు టియాంజిన్ నగరంలో జరిగే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గోనేందుకు ప్రధానమంత్రి చైనాకు వెళతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పిఎం జన్ ధన్ యోజన భారతదేశాన్ని ఆర్థిక సాధికారత వైపు నడిపించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకం నేటితో 11 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు ప్రధానమంత్రి స్పందిస్తూ.. ఈ పథకం ప్రజలకు గౌరవాన్ని పెంచిందని, వారి ఆర్థిక స్థితిగతులను వారే మార్చుకునే శక్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. ఇక మరోవైపు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (DBT) ద్వారా వివిధ పథకాల కింద ప్రయోజనాలు, రుణ సౌకర్యాలు అందించడం, సామాజిక భద్రత కల్పించడానికి ప్రధానమంత్రి జన్ ధన్ యోజన దోహదపడిందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఒక సందేశంలో పేర్కొన్నారు. గత 11 సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా 56 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు తెరవబడ్డాయని, మొత్తం

2.68 లక్షల కోట్ల రూపాయల డిపాజిట్ బ్యాలెన్స్‌ను సేకరించామని తెలిపారు. 38 కోట్లకు పైగా రూపే కార్డులను జారీ చేశామని, డిజిటల్ లావాదేవీలను సులభతరం చేశామని నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నౌకాయ్ పండుగ సందర్భంగా దేశ పౌరులకు ముఖ్యంగా ఒడిశా రాష్ట్ర ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయం పట్ల గౌరవం, రైతుల పట్ల కృతజ్ఞతను వ్యక్తపరించేందుకు ఈ పండుగ ఒక పవిత్రమైన అవకాశంగా నిలుస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. సద్భావన, సాన్నిహిత్యానికి ప్రతీక అయిన నౌకాయ్ పండుగ.. ప్రతి ఒక్కరి జీవితాలలో ఆనందం, శాంతి, శ్రేయస్సును నింపాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికి ఆహారం అందించేందుకు నిరంతరం కష్టపడుతున్న రైతులకు నౌకాయ్ పండుగ కృతజ్ఞతలను తెలియజేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్రలోని ముంబైలో విరార్ ఈస్ట్‌లో నిన్న రాత్రి నాలుగు అంతస్తుల భవనం కూలిపోయిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 17 కు చేరుకుంది. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. సహాయక బృందాలు ఇప్పటివరకు 24 మందిని రక్షించారు. శిథిలాల కింద మరింత మంది బాధితులు చిక్కుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మృతిచెందిన వారికి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సంతాపాన్ని తెలియజేశారు. మరణించిన వారి ఒక్కొక్క కుటుంబానికి 5లక్షల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఖతార్ సుముఖత వ్యక్తం చేస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో ఖతార్ విదేశీ వాణిజ్య వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ అహ్మద్ బిన్ మొహమ్మద్ అల్-సయీద్ తో నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్-ఖతార్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడి సంబంధాల బలోపేతంపై ఇరువురు చర్చించామని సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అలాగే.. ఈ చర్చల సందర్భంగా, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి గత దశాబ్దంలో భారత్ చేపట్టిన పరివర్తన చర్యలను వివరించినట్లు సీతారామన్ వెల్లడించారు. ఖతార్ ప్రతినిధి బృందం భారతదేశ ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతిపై విశ్వాసం వ్యక్తం చేసిందని, దేశంలో పెట్టుబడులకు బలమైన అవకాశాలను గుర్తించిందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు క్వార్టర్ ఫైనల్స్‌కి చేరుకుంది. ఈరోజు జరిగిన మ్యాచ్ లో ప్రపంచ రెండో ర్యాంకర్ అయిన చైనా క్రీడాకారిణి వాంగ్ జీ యీ ని 21-17, 21-15 స్కోర్‌తో ఓడించింది. ఈ విజయంతో సింధు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్‌లో ఇండోనేషియాకు చెందిన ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ పుత్రి కుసుమతో సింధు పోటీపడనుంది.
మరోవైపు భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద గ్రాండ్ చెస్ టూర్(GCT) ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. చివరి రౌండ్‌లో అమెరికాకు చెందిన లెవాన్ అరోనియన్‌తో జరిగిన మ్యాచ్ ను డ్రా గా ముగించి ప్రజ్ఞానంద GCT ఫైనల్స్‌కు చేరుకున్నాడు. 2025 GCT సర్క్యూట్‌లో 30 పాయింట్లతో నాల్గవ స్థానంలో నిలిచాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు అమల్లోకి రావడంతో పాటూ అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాల కొనసాగుతుండడం వంటి కారణాలతో దేశీయ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. సెన్సెక్స్ ఉదయం 80,754 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై చివరికి 705పాయింట్ల నష్టంతో 80,080 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 211పాయింట్ల నష్టంతో 24,500వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.63గా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్, కర్ణాటక తీరప్రాంతం, మధ్య మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలోని పలు  ప్రాంతాల్లో రాగల 24 గంటలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని  భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ఒడిశా, విదర్భ, మధ్యప్రదేశ్, ఉప-హిమాలయన్ పశ్చిమ బెంగాల్, సిక్కిం, జార్ఖండ్‌లలో రాబోయే 2, 3 రోజులలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్త శశిక్రాంత్ మిశ్రా పేర్కొంటూ..

(వాయిస్ బైట్...22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లోని  ఉధంపూర్-రాంబన్ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో కీలకమైన జాతీయ రహదారి 44 వరుసగా మూడవరోజు కూడా మూసివేయబడింది. దీంతో ఆ మార్గంలో 600 కి పైగా వాహనాలు అనేక చోట్ల నిలిచిపోయాయి. కాశ్మీర్ ను ఇతర ప్రాంతాలతో అనుసంధానించే 250 కి.మీ. పొడవైన ఈ రహదారి మార్గం అన్ని వాతావరణాలకు అనువైన ఏకైక రహదారి. దీనిని మూసివేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయి సరుకు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముడి పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపును డిసెంబర్ 31 వరకు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. భారత వస్త్ర రంగానికి పత్తి లభ్యతను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అంతకుముందు, సెప్టెంబర్ 30 వరకు పత్తిపై దిగుమతి సుంకాన్ని తాత్కాలికంగా మినహాయించిన ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =